# చక్రబంధం

యెన్ని మెరుపులు దాడులు చేస్తేనేం? యెంత దీక్షగా, నిజాయితీగా తానుంటేనేం? కుటుంబ సుఖాలక్కూడా పెద్దగా నోచుకోకుండా యెంత బాధ్యతతో పనిచేస్తేనేం? యెర్ర చందనం దొంగ రవాణా సాగిపోతూనేవుంది. దాని దారి దాని కుంటుంది. కాపీ ఆ దారికే గండి కొట్టాలి. దొంగ రవాణా ఆపాలి. యెట్లా ఆపడం? యీ యెర్రచందనం రాకిట్‌ను యెట్లా బద్దలు కొట్టడం?

డి. యఫ్. వో కేశవరావు తల బద్దలు కొట్టుకుంటున్నాడు. చేయవలసిన అభిమన్యు సాహసాలకు మనసులో రూపకల్పన చేసుకుంటున్నాడు. ఆ సమయంలో ఆయన కొడుకు విద్యాసాగర్ పలకరించాడు:

"నాన్నా! నేను ట్యూషన్ చేర్తా."

"దేనికి?" కొంత పరధ్యానంతో కేశవరావు అడిగాడు.

"స్కూళ్లో పాఠాలు సరిగా అర్థం కావడంలేదు."

"రోజూ యింటిదగ్గర కష్టపడి చదువుకుంటే అర్థమవుతాయి" కేశవరావు చిరునవ్వుతో సాగర్ మరింత చనువుతో అన్నాడు:

"యింట్లో చదువుకుంటూనే వున్నా. కానీ చిత్తూర్లోకంటే యిక్కడ పాఠాల్లో ముందున్నారు. వెనక పాఠాలు బొత్తిగా అర్థం కాలేదు. ట్యూషన్‌లో చెప్పించుకుంటా. మా క్లాసులో చాలామంది ట్యూషన్‌కు పోతున్నారు. యీసారి పబ్లిక్ పరీక్షలు. అందుకని పోతున్నారు. మా సెవెన్త్ క్లాస్ అయ్యవారందర్లోను భూషణంసారని ఆసారు బాగా చెప్తాడు. ట్యూషన్లో అన్ని సబ్జక్టులూ చెబుతాడంట. మా ఫ్రెండు చెప్పాడు. ట్యూషన్‌కు పోతా నాన్నా"

"సరే పోదువుగానీ. బాగా చదువుకోవాలి. మంచిమార్కులు రావాలి. మంచి పేరు తెచ్చుకోవాలి."

"భూషణం సారు దగ్గరయితే బాగా చదువుకొంటాను. మిగతా సార్ల దగ్గరొద్దు. సరిగా చెప్పరు. ఆ ముసలి పుల్లయ్యసారు దగ్గరొద్దు. బోరు. పైగా అన్నిటికీ తిడతాడు.

సాగర్ ఆరిందాతనానికి కేశవరావుకు నవ్వు వచ్చింది. కానీ నవ్వలేదు.

"భూషణం సారు దగ్గరకు యెప్పుడు పోదాం నాన్నా?"

"రేపు ఆదివారం శలవుకదా? తప్పకుండా తీసుకుపోతా"

ఆనందంలో గెంతులు వేసుకుంటూ సాగర్ యింట్లోకివెళ్ళాడు. యెన్ని గొడవల్లోవున్నా, కాస్త వోపికనూ, ప్రేమనూ చూపిస్తే పిల్లలకెంత ఆనందమో అనుకున్నాడు కేశవరావు. సాగర్ చదువూ భవిష్యత్తూ అతని మనసును పట్టుకున్నాయి.

సాగర్‌కు చదువుమీద శ్రద్ధవుంది. యేం లాభం? యింట్లో సాగర్ చదువు పట్టించుకోడానికి తీరికలేదు. తన వుద్యోగం అల్లాంటిది. తన భార్యకు చదువురాదు. సాగర్‌కు యింట్లో యివ్వగలిగిందల్లా కొంత సంస్కారమూ. కొన్ని ఆదర్శాలూ. యీ ట్రాన్స్ఫర్లతో సాగర్ చదువు దెబ్బతింది. ట్యూషన్ యేర్పాటు చేయక తప్పదు. యీ స్కూళ్ళల్లో చదువులు సరిగారావు. బండెలదొడ్లు. మంద చదువులు. మిత్రులు సాగర్‌ను కాన్వెంట్‌లో చేర్చమన్నారు. తాను జిల్లా పరిషత్ స్కూల్లో చేర్చాడు. కాన్వెంట్స్‌లో యేం చెబుతారు? బట్లరు భాష. నాటు దొరల మేనర్సు; కొంపను గుళ్ళచేసే స్టయిల్స్. డబ్బు దండగ. తన డబ్బు; తన శ్రమ; తన నిజాయితీ; తన ఆదర్శం. కాన్వెంట్లకంటే యే సత్రంలోనో. రేకుల షెడ్డులోనో. ఆఖరుకు గొడ్ల సావిడిలోనో వుండే స్కూళ్ళే నయం! వాటిలో అంతస్థుల పిచ్చి తలకెక్కదు. సాగర్‌ను అన్ని విధాలా ఆదర్శవంతున్ని చేయాలి. మంచి టీచరు దగ్గర విడవాలి. కేశవరావు. భూషణం విషయం తెలుసుకున్నాడు.

ఆదివారం సాగర్‌ను వెంట బెట్టుకొని. కేశవరావు భూషణం యింటికి వెళ్ళాడు. అయిదుగురు పిల్లలకు శ్రద్ధగా చదువు చెబుతున్న భూషణాన్ని చూస్తూనే కేశవరావుకు సదభిప్రాయం కలిగింది. భూషణం యింట్లో మరీ కొట్టవచ్చినట్లు కన్పిస్తున్న దరిద్రం గుర్తులు కేశవరావును బాధించాయి. క్షణకాలం అతనికి ఆ వాతావరణం అసహ్యంకూడా వేసింది. కేశవరావును చూసి భూషణం ఆశ్చర్యం నుంచి తేరుకోక మునుపే. కేశవరావు తన్ను తాను పరిచయం చేసు

కున్నాడు. కుశల ప్రశ్నల తర్వాత కేశవరావు తానొచ్చినపని వివరించాడు:

"చూడండి భూషణంగారూ! మీ గురించి విన్నాను. మా సాగర్‌ను మీ దగ్గర ట్యూషన్ విడవాలని వచ్చాను. మా అబ్బాయికి మీ మీద గురివుంది. టీచరుమీద స్టూడెంటుకు నమ్మకం లేకపోతే యెట్లా? మీ వద్దకు ట్యూషనొస్తాడు. నిజం మాట్లాడితే నాకు ట్యూషన్లంటే గౌరవంలేదు. మన స్కూళ్ళే స్పూన్ ఫీడింగ్ సెంటర్లు. ట్యూషన్ల సంగతి చెప్పేదేముంది? నేనెందుకు ట్యూషన్ చేర్పిస్తున్నానంటారా! వీల్లేక. కొన్ని యిబ్బందులవల్ల సాగర్ చదువు దెబ్బతింది. చదువులో మా అబ్బాయికి కాస్త నిజమైన అభిరుచి కలిగేటట్లు చూడండి."

భూషణం పేలవంగా నవ్వాడు.

"సాగర్ మీ యింటికే మీ వీలునుబట్టి వస్తుంటాడు. అది గౌరవంగా వుంటుంది. మా యిల్లు దగ్గిరేలెండి మీయింటికి. మామూలుగా మీరెంత తీసుకుంటారో అంత ట్యూషన్ ఫీజిస్తాను.''

కేశవరావు వెళ్ళిపోయాక్కూడా భూషణం ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. కేశవరావు మర్యాదకూ, మాటల్లోని సంస్కారానికీ పుక్కిరి బిక్కిరి అయ్యాడు. బడిపంతులు వుద్యోగంలో చేరిన యీ రెండేళ్ళలోనూ, చావు బతుకుల్లోవున్న తన వ్యక్తిత్వాన్ని యెవరూ యింతగా గుర్తించలేదు. తనకింత గౌరవాన్ని యెవరూ యివ్వలేదు. తన్నింతగా యెవరూ ఆదరించలేదు.

భూషణానికి ఆ సమయంలో తన్నొక పేద పురుగ్గా చూసే జిల్లా పరిషత్. డి. యి. వో ఆఫీసుల అధికారులు గుర్తొచ్చారు.

కాస్తా అధికారం వుంటే. యింటికొచ్చి తమ పిల్లలకు పాఠం చెప్పి పొమ్మనే అధికారులూ గుర్తొచ్చారు. వీల్లేక యీ సంవత్సరం వొప్పు కుంటే. బజారు పనులు చెప్పే తాసిల్దారు భార్య గుర్తుకొచ్చింది. తన అస్తిత్వాన్నే గుర్తించని సాటి మనుషులు గుర్తొచ్చారు. కేశవ రావు లాంటి వాళ్ళు అరుదు అనుకున్నాడు భూషణం. కేశవరావు పట్ల భూషణం హృదయం అపారగౌరవ భావంతో నిండింది. సాగర్ చదువుపట్ల కొంత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మేలు. తెలివైనవాడే. కేశవరావుగారిని మంచి చేసుకోవచ్చు. తమ్మునికి యే ఫారెస్టరు వుద్యోగమొచ్చినా కష్టాలన్నీ తీరతాయి. వాడొక కొంపక్కారివి.. వాడికెట్లాగూ బి. యిడి.. సీటురాదు. బి.యస్‌సి.. మూడు సార్లు తప్పి నాలుగోసారి పాసైన వాడికెవడిస్తాడు? బొట్టు పెట్టి పిలిచి యిచ్చినా తను చదివించలేడు. యెట్లాగో చదివించినా వుద్యోగంరాదు. సెకండ్రి గ్రేడ్ టీచరుద్యోగం సంపాదించడానికే తను మూడేళ్ళు చచ్చి సున్న మయ్యాడు. కేశవరావుగారు యెంతో మంచివారుగా కన్పిస్తున్నారు. గొప్పవారు తమ్మునికి వుద్యోగమివ్వవచ్చు.

భూషణం తన తమ్ముణ్ని ఫారెస్టరుగా వూహించు కున్నాడు. వాడి సాయంతో చావుతోకానీ నయంకాని తన తండ్రి జబ్బు నయమైనట్లూ. పదివేలిచ్చి చెల్లెలు పెళ్లిచేసినట్లూ. మంచి యిల్లె క్కడో కట్టుకున్నట్లూ. ఫారెస్టరు బంజరు భూమేదో సంపాయించి నట్లూ. వూహించుకున్నాడు. తనవి దరిద్రపు ఆలోచనలని కృంగి పోయాడు.

మరునాటినుంచీ భూషణం సాగర్‌కు ట్యూషన్ చెప్పసాగాడు.

యెర్ర చందనం జపాన్‌కు దొంగ రవాణాచేసే రాకెట్ నాయకుడు సెంట్రల్లో పలుకుబడివున్న లోకల్ పార్లమెంటు మెంబరని తెలిసినప్పటినుంచీ కేశవరావుకు దిక్కుతోచడంలేదు. వుద్యోగ బాధ్యతా నిర్వహణకూ, ఆబాధ్యత నిజాయితీగా నిర్వహిస్తే తీసుకొచ్చే బాధల పరంపరలకూ మధ్య కేశవరావు నలిగిపోతున్నాడు.

తన ఆదర్శాలు దినదిన గండంగా తయారయ్యాయి. తన నీతి నిజాయితీలు సుడిగాలిలో దీపాలయ్యాయి. న్యాయంగా డ్యూటీ చేయడం కష్టమై పోతూంది. యీ మారేమవుతుందో? ట్రాన్స్ఫరంటే భయంలేదు. ఆదిలాబాదైనా తనకిబ్బందిలేదు. కానీ ఆ పార్లమెంటు మెంబరుగాడొక గూండా. మొన్నరాత్రి యెర్ర చందనాన్ని మద్రాసుకు స్మగుల్ చేస్తున్న లారీని పట్టుకోడానికి వెంటబడితే లారీలో వాళ్ళు గాల్లో కాల్పులు జరిపి, బెదిరించి తప్పించుకొన్నారు. యీ అడవి బ్రతుక్కంటే యే టీచరుద్యోగమైనా నయమే. వున్నంతలో హాయిగా బ్రతకొచ్చు.

కేశవరావుకు తన వుద్యోగం మీద రోత పుట్టింది. అతని మనస్సు డ్రెయినేజీ నీళ్ళు కలుస్తున్న మంచినీళ్ళ చెరువులా వుంది. అతని హృదయం పుచ్చులమధ్య పిట్టలా భయం భయంగా వుంది.

‘‘నాన్నా! నాన్నా!’’

సాగర్ పిలుపుతో అంతర్ముఖుడైన కేశవరావు యెర్ర చందనం లోకం నుంచి తేరుకున్నాడు. కోపం వచ్చింది. తమాయించుకున్నాడు. జీవంలేని చిరునవ్వు నవ్వాడు. పట్టలేని వుత్సాహంతో సాగర్ చెప్పాడు:

"చూడు నాన్నా! యీ అర్నెల్ల పరీక్షల్లో నాకెంత మంచి మార్కులు వచ్చినాయో! తెలుగు డెబ్బయ్యేరు. యింగ్లీషు డెబ్బయి. లెక్కలు యెనభై రెండు. సోషల్ అరవై తొమ్మిది. సైన్సు డెబ్బయి నాలుగు. హిందీ యాభై ఆరు" సాగర్ మార్కులు వింటూంటే కేశవరావుకు వుత్సాహం పొంగుకొచ్చింది; గర్వం పొడసూపింది. మూన్నెళ్ళలోనే భూషణం కృషివల్ల సాగర్ గుడ్ స్టూడెంట్ అయ్యాడు. భూషణాన్ని థాంక్ చెయ్యాలి.

వుల్లాసంగా కేశవరావు అడిగాడు:

"యింగ్లీషు, సోషల్"

"అన్నిట్లో ఫస్టు మార్కులు రావాలి. అప్పుడు సాగర్ గుడ్ స్టూడెంట్ అంటారు.

"వచ్చేవే నాన్నా. సారయితే పరీక్షలముందు అన్ని కొశ్చెన్ పేపర్లు చెప్పి జవాబులు రాసి యిచ్చినాడు. బాగా చదువుకున్నా. బాగా రాసినా. మా సారు దిద్దిన వాటిల్లో నేను ఫస్టు. మా సారు న్యాయంగా దిద్దుతారు. అదిగో వెంకట్రమణసారూ. పుల్లయ్యసారూ దిద్దిన వాటిల్లో వాళ్ళ ట్యూషన్ పిల్లలే ఫస్టు. ఫస్టొచ్చినా వాళ్ళకేం రాదు. క్లాసుల్లో మొద్దులు."

కేశవరావు కొయ్యబారిపోయాడు.

భూషణం నీకు ముందుగానే ప్రశ్నలు చెప్పాడా? తప్పుకదూ"

కేశవరావు కంఠం వణికింది.

"అందరు టీచర్లూ అంతే నాన్నా. వాళ్ళ వాళ్ళ ట్యూషన్ పిల్లలకు పరీక్షల్లో వచ్చేవన్నీ ముందే చెప్తారు. అందుకే ట్యూషన్లు చేర్తారు."

"అట్లని యెవరు చెప్పారు?"

"మా క్లాసు పిల్లలు"

"కాపీలు కొట్టావా"?

"లేదు నాన్నా. నిజ్జంగా అమ్మమీద వొట్టు. కాపీలు కొట్ట లేదు నాన్నా. చాలామంది కొడ్తున్నా నేను కొట్టలేదు. మా సారునే అడుగు. స్కూల్లో మిగతా టీచర్ల నడుగు. కాపీలు నేను కొట్టను నాన్నా. నాకు భయం"

"సరేలే. యింకెప్పుడూ పరీక్షలముందు ప్రశ్నలు చెప్పించు కోవద్దు"

"నేను చెప్పించుకోలేదు. సారే చెప్పినాడు"

"అట్లా చెప్పొద్దని చెప్పాలి. కష్టపడి చదవాలి. రాయాలి గానీ యిట్లాంటి పద్ధతులు తప్పు. తప్పుడు పనుల్తో చదువులు రావు. తెలిసిందా?"

తండ్రి మందలింపుకు సాగర్ బెదిరిపోయాడు

చదువుల్లో అవినీతి పసితనం నుంచే మొదలయితే యిక వాళ్ళెందుకు పనికొస్తారు? పెద్దయ్యాక మోసగాళ్ళవుతారు. నీతి నియమాల్లేని దొంగ వెధవలవుతారు. సాగర్ చెడిపోతున్నాడు. యిక సొంతశక్తి మీద నమ్మకం పోతుంది. తెలివితేటలు తప్పుదోవన

పోతాయి. రాష్ట్రింలోనే ఆనెస్ట్ ఆఫీసరని పేరు తెచ్చుకున్న తన పెంపకంలోనే తన కొడుకు రోగ్ గా తయారవుతాడు.

కేశవరావు యిక ఆలోచించలేక పోయాడు. భూషణంమీద అతనికి పట్టరానంత కోపం వచ్చింది. జుగుప్స కలిగింది.

భూషణాన్ని నిలువునా కడిగి పారెయ్యాలి. డిసానెస్ట్ స్కౌండ్రల్! వాణ్నిప్పుడే. యిక్కడే దులిపెయ్యాలి.

ఆవేశంలోనే. భూషణాన్ని కేశవరావు యింటికి పిలిపించు కొన్నాడు. కూర్చోమనలేదు. నాలుగూ దులిపాడు:

"మంచి టీచరువు గదా అని నీ దగ్గర విడిచాను. యువకు డివి. వెధవ బుద్ధులుండవని నిన్ను నమ్మాను. నువ్వుకూడా యింత దగుల్బాజీవనుకోలేదు. నువ్వు చెప్పే చదువులంటే యివ్వేనా? పరీక్ష లకు ముందు కొశ్చెనాన్సర్లు డిక్టేట్ చేయడం. నీ కిష్టమొచ్చిన మార్కులు వేయడం. నీ దగ్గర పిల్లలకు చదువబ్బదు. కుట్రా కుయుక్తులబ్బుతాయి. నువ్వు చెడింది చాల్దూ? యీ చదువులకుబట్టిన కాన్సర్ నువ్వు. నీదగ్గర ట్యూషన్ విడవడం వాదే బుద్ధితక్కువ. రేపట్నుంచీ సాగర్ ట్యూషన్‌కు రాడు. ముందిక్కణ్నుంచి వెళ్ళు. డబ్బు చూసి పంపిస్తాను."

ఆవేశం యెక్కువై కేశవరావు మాట్లాడలేక పోయాడు. సాగర్ వాక కుర్చీని అంటుకొని బిక్కు బిక్కుమంటూ భయంతో జరిగేది చూస్తున్నాడు-గాలి వానలో దిక్కు తెలీని కుందేలుపిల్లలాగా.

సాగర్‌కు మంచి మార్కులు వచ్చాయని. తన్ను అభినం దించడానికి పిలిచాడనుకొన్న భూషణం. యీ తుఫానుకు తల్లడిల్లి

పోయాడు. విషం మింగినట్లు తిట్లు వార్చుకొని, భూషణం స్వగతంగా చెప్పుకపోయాడు:

"పోయిన సంవత్సరం నేనీపని చెయ్యలేదు. నా ట్యూషన్లో యిరవైమందుండేవారు. వాళ్ళకు మనస్ఫూర్తిగా చదువు చెప్పాను. పరీక్షల్లో వచ్చే కొశ్చెన్లు చెప్పలేదు; వాటికి అన్సర్లు రాసివ్వలేదు. 'మీ ట్యూషన్లో పిల్లలకు మా సబ్జెక్ట కొశ్చెన్లు చెబుతాం. నీ సబ్జెక్ట కొశ్చెన్లు చెప్ప'మని మా కొలీగ్సడిగితే పిల్లలు చెడిపోతారని వద్దన్నాను. తమ దారికొచ్చేదాకా వాళ్లూరుకోలేదు. సంవత్సరం పరీక్షల్లో కాపీలుజరుగుతూంటే పట్టుకున్నాను. కాపీ గొట్టే నా ట్యూషను పిల్లల్ని కూడా వదల్లేదు. వాళ్ళ పెద్దవాళ్లు మీదికొచ్చారు. హెడ్‌మాష్టర్ నాకు టాక్ట్ లేదన్నాడు. అంతే ట్యూషన్లు పోయాయి. అవి లేకపోతే సంసారం జరగదు. యీయేడు మిగతా టీచర్లలాగే నేనూ. యేదో రకంగా పిల్లలు పాసు కావాలని వాళ్ళ పెద్దవాళ్ళు. అందుకేట్యూషన్లు చేర్పిస్తారు. యెంతయినా సొంత బిడ్డల విషయంలో అందరిలాగే మీరనుకున్నాను. మిగతా పిల్లల్తోపాటూ మీ అబ్బాయికీ కొశ్చెనాన్సర్లు పరీక్షలముందే చెప్పాను."

కేశవరావుకు నోట మాట రాలేదు.

తాను అనాలోచితంగా భూషణంమీద విరుచుకపడ్డాడు. అవినీతి అందలమెక్కిన రోజులివి. చదువూ. వుద్యోగం. జీవితం అన్నీ కలుషితమైన రోజులివి. తన కాళ్ళకింద భూమికూడా తొలుచుక పోతూంది. తన ఆదర్శం పునాదులుకూడా కదలిపోతున్నాయి. యివ్వాళ కాకపోయినా రేపైనా తనూ దిగజారక తప్పని పరిస్థితులు

కన్పిస్తూనే వున్నాయి. యీ స్థితిలో భూషణంమీద నోరు పారవేసు కోవడమేమిటి? తిడితే వారిగేదేముంది? విలువలెందుకిట్లా పాడవు తాయో ఆలోచించాలి గానీ.

తలవొంచుకొని వెళ్ళిపోతున్న భూషణాన్ని కేశవరావు వెనక్కి పిలిచి క్షమాపణ చెప్పాలనుకున్నాడు. కానీ గొంతులో దిగబడ్డ వుండ అడ్డొచ్చింది. యెదురుగా కుర్చీలో భయంతో గువ్వలా వొదిగి కూర్చొన్న సాగర్‌ను పిలిచి దగ్గరకు తీసుకున్నాడు. ఆయన కలత తగ్గలేదు. యింకా యెక్కువయింది.

సెప్టంబరు 1973